సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 24 । మార్చి । 2023



31న డాక్ అదాలత్


బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ డివిజనల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈ నెల 31న మధ్యాహ్నం 3 గంటలకు 'డాక్ అదాలత్' నిర్వహించనున్నారు.



అన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి అడబాల శ్రీరామారావు (కాకినాడ) రూ.1,00,116 విరాళాన్ని గురువారం దేవస్థానం అధికారులకు సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు గురువారం 6,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,850,మధ్య డెల్టాకు 1,200,పశ్చిమ డెల్టాకు 3,200క్యూసెక్కులు వదిలారు.



వారధికి విత్తర్వులు

- నర్సాపురం- సఖినేటిపల్లి వంతెనకు గ్రీన్ సిగ్నల్
- రూ.580 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసిన ఎన్‌హెచ్ అథారిటీ

సాక్షి అమలాపురం/మలికిపురం/సఖినేటిపల్లి: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ గోదావరిపై మరో వంతెన రాబోతోంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లా వాసుల దశాబ్దాల కలను నిజం చేస్తూ సఖినేటిపల్లి- నర్సాపురం మధ్య వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగా జాతీయ రహదారి 216 బైపాస్ రోడ్డులో వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ఎన్‌హెచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

ఉమ్మడి జిల్లాలో కోనసీమ - నర్సాపురం వంతెన నిర్మాణం చేయాలని దశాబ్దకాలం నుంచి రెండు జిల్లాల వాసులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ వశిష్ఠ నదిపై పంటు దాటుతున్నారు. గతంలో రాజోలు దీవి, పశ్చిమకు వంతెన సౌకర్యం లేకుండా ఉండేది. అయితే దిండి- చించినాడ మధ్య వంతెన అందుబాటులోకి వచ్చిన తరువాత స్థానికుల ప్రయాణ అవసరాలు చాలా వరకు తీరాయి. అయినప్పటికీ నర్సాపురం- సఖినేటిపల్లి వంతెన అవసరమని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. జిల్లాలో సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లోని తీర వాసులు, విద్యార్థులు, వ్యాపారులు నర్సాపురం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం వీరు పంటు మీద దాటాల్సి వస్తోంది. దీని స్థానంలో వంతెన నిర్మించాలనే స్థానికుల డిమాండ్‌కు ఏళ్లుగా మోక్షం కలగలేదు.

వైఎస్సార్ హయాంలో శంకుస్థాపన

ఉమ్మడి రాష్ట్రంలో ఈ వంతెనకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.194 కోట్లు మంజూరు చేస్తూ 2008 ఏప్రిల్ 16న శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న మైటాస్ కంపెనీ వివాదాల్లో చిక్కుకోవడం, వైఎస్సార్ మృత్యువాత పడడంతో దీని నిర్మాణ పనులు ఆరంభం కాలేదు. తరువాత ముఖ్యమంత్రులుగా వచ్చిన దివంగత రోశయ్య, ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి వంతెన పనులను గాలికి వదిలేశారు. విభజన తరువాత సీఎం అయిన చంద్రబాబు వంతెనకు నిధులు ఇవ్వలేదు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి కూడా కనీసం జాతీయ రహదారుల పరిధిలోకి ఈ వంతెనను తీసుకుని రాలేకపోయారు.



సఖినేటిపల్లి- నర్సాపురం రేవులో పంటు ప్రయాణం



ఎన్‌హెచ్ 216 విస్తరణలో భాగంగా అమలాపురం వద్ద బైపాస్ రోడ్డు పనులు

ఫలించిన సీఎం జగన్ యత్నాలు

- ఆర్‌అండ్‌బీ పరిధిలోని వంతెన నిర్మాణాన్ని జాతీయ రహదారి పరిధిలోకి తీసుకువచ్చారు. 216 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కోనసీమ జిల్లా శివకోడు నుంచి సఖినేటిపల్లి మీదుగా నర్సాపురం వరకు బైపాస్ నిర్మించాలని సీఎం జగన్ కేంద్ర ఉపరితల రవాణా శాఖమంత్రి నితిన్ గడ్కరీని కోరారు. సుమారు 22.17 కిలోమీటర్లు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును హైవేగా మార్పు చేయాలని కోరగా అందుకు గడ్కరీ అంగీకరించారు. దీనిలో భాగంగానే రామరాజులంక వద్ద వశిష్ఠపై 380 మీటర్ల మేర వంతెన నిర్మాణం చేయనున్నారు.
- ఇందుకు సంబంధించి ఈ నెల 16వ తేదీన ఉపరితల రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వంతెన, రహదారి నిర్మాణాలకు రూ.658.12 కోట్లకు ప్రతిపాదనలు పంపగా, రూ.580.42 కోట్లకు అనుమతి మంజూరు చేశారు. కిలోమీటరుకు రూ.26.18 కోట్లు అవుతోందని లెక్కలు కట్టిన ఎన్‌హెచ్ అందుకు తగినట్టుగా నిధులు మంజూరు చేసింది. సీఎం జగన్ సిఫారసు మేరకు రహదారిని ఎన్‌హెచ్ పరిధిలోకి తీసుకురావడంతో వంతెనకు మోక్షం కలిగినట్టయ్యింది.
- కోనసీమ జిల్లాలో శివకోడు నుంచి టేకిశెట్టిపాలెం, మూడు తూములు, సఖినేటిపల్లి మీదుగా వశిష్ఠ దాటుకుని నర్సాపురం మండలం రాజుల్లంక మీదుగా సీతారాంపురం వద్ద 216 జాతీయ రహదారిలో కలుస్తోంది.
- సఖినేటిపల్లి మీదుగా నర్సాపురం బైపాస్ రోడ్డు, వంతెన నిర్మాణ పనులను 2025-26 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2023-24లో రూ.197.18 కోట్ల విలువైన 20 శాతం పనులు, 2024-25లో 75 శాతం పనులు, 2025-26 నాటికి 100 శాతం పనులు చేయనున్నారు.
- వంతెన నిర్మాణం పూర్తయితే కోనసీమ, పశ్చిమ గోదావరి తీర ప్రాంత వాసులకు ఒంగోలు ప్రయాణం 34 కిలోమీటర్లు కలసి వస్తుంది.

నిధుల మంజూరు హర్షణీయం



వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయం. ఈ వంతెన నిర్మాణంతో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, నరసాపురం జిల్లా మధ్య దూరంగా తగ్గుతుంది. 216 జాతీయ రహదారికి అనుసంధానం చేయడం వల్ల ఈ ప్రాంతాలు అభివృద్ధిని సాధిస్తాయి. వంతెన నిర్మాణానికి కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, నిధులు మంజూరు చేసిన జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యదర్శి కమలప్రకాష్‌కి రెండు జిల్లాల ప్రజల తరఫున కృతజ్ఞతలు.

– చింతా అనురాధ, ఎంపీ, అమలాపురం

సీఎం జగన్ కృషితో సాకారం



వంతెన నిర్మాణం అనే ప్రజల చిరకాల ఆకాంక్ష ముఖ్యమంత్రి జగన్ కృషితో సాకారం కాబోతోంది. వంతెనతో పాటు జాతీయ రహదారి 216 బైపాస్ రాజోలు దీవిలో అన్ని మండలాల మీదుగా వెళుతుంది. ఇది ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా పక్కా ప్రణాళికతో కార్యాచరణ రూపొందించారు.

– రాపాక వర ప్రసాదరావు, ఎమ్మెల్యే, రాజోలు

న్యూస్‌రీల్

వెంకన్న హుండీల రాబడి రూ. 55.53 లక్షలు



హుండీలను లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి హుండీలను గురువారం లెక్కించగా రూ.55,53,189 ఆదాయం వచ్చినట్లు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 31 రోజులకు హుండీలను లెక్కించగా ప్రధాన హుండీల నుంచి రూ.43,27,263, అన్న ప్రసాదం హుండీల నుంచి రూ.12,25,926 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. బంగారం 42 గ్రాములు, వెండి 507 గ్రాములు, విదేశీ కరెన్సీ వచ్చిందన్నారు. ఆలయ క్షేత్రపాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీలను 31రోజులకు లెక్కించగా రూ.1,45,892 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ గుర్రం సత్య వరప్రసాద్, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకమ్మ అన్నదాన సత్రం ఈవో మీసాల రాధాకృష్ణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 12,547 మంది హాజరు

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 38 పరీక్షా కేంద్రాల్లో గురువారం ఇంటర్ ఫస్టియర్ గణితం-1బి, జువాలజీ, హిస్టరీ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 13,318 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 12,547 మంది హాజరు కాగా, 771 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ జనరల్ పరీక్షలకు 10,546 మందికి 10,093 మంది హాజరు కాగా, 453 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షలకు 2,772 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 2,454 మంది రాయగా, 318 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియెట్ బోర్డు డీవీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

ఎంఎల్‌హెచ్‌పీ ఫిర్యాదుపై ఆర్డీవో విచారణ

అంబాజీపేట: విధులకు ఆటంకం కలిగిస్తూ మానసికంగా వేధింపులకు గురిచేస్తున్న కె.పెదపూడి వార్డు సభ్యుడు బీర రాజారావు, హెల్త్ సూపర్‌వైజర్ నెల్లి మధుబాబులపై మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) శ్రావణి చేసిన ఫిర్యాదు మేరకు కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి విచారణ చేపట్టారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణితో పాటు, ఇతరులను గురువారం విచారించారు. ఆర్డీవో మాట్లాడుతూ విచారణ అనంతరం తన నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తానన్నారు. ఆర్డీఓతో పాటు తహసీల్దార్ టి.మంగతాయారు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి యువతే కీలకం



ఉప్పలగుప్తంలో విలేకర్లతో మాట్లాడుతున్న గణేష్

ఉప్పలగుప్తం: పార్టీని మరింత బలోపేతం చేయడంలో యువతదే కీలక పాత్రని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో గురువారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్ ఇంటికి విచ్చేసిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రతి ప్రాంతానికి వెళ్లి యువతను కలిసి చైతన్యం తీసుకొచ్చి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించి మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని యువ కార్యకర్తలకు సూచించారు. సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, చీకట్ల కిషోర్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదటి శిరీష్, చిక్కం బాల సుబ్రహ్మణ్యం, మోకా శ్రీను పాల్గొన్నారు.

శెట్టిబలిజల గుండెల్లో దొమ్మేటికి చిర స్థానం



వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, శెట్టిబలిజ నేతలు

అమలాపురం టౌన్: అయిదు ఉప కులాలుగా ఉన్నవారిని ఏకం చేసిన శెట్టిబలిజల పితామహుడు దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి సంఘీయులు గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచి ఉన్నారని ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక హైస్కూలు సెంటరులోని శెట్టిబలిజ గ్రంథాలయంలో గురువారం జరిగిన వెంకటరెడ్డి 170వ జయంతి కార్యక్రమంలో సూర్యనారాయణరావు మాట్లాడారు. తొలుత దివంగత వెంకటరెడ్డి చిత్రపటానికి సంఘ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాడు సంఘీయుల కోసం వెంకటరెడ్డి చేసిన మహోన్నత ప్రయత్నం చిరస్మరణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, శెట్టిబలిజ సంఘాల నేతలు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, వాసంశెట్టి తాతాజీ, బొక్కా ఆదినారాయణ, కుడుపూడి త్రినాథ్, ఎంఎం శెట్టి, చప్పిడి శోభన్‌బాబు, గుబ్బల మనోహర్, కేతా భానుతేజ వెంకటరెడ్డి సేవలను కొనియాడారు.

పౌష్టికాహారంతోనే క్షయ నిర్మూలన

డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దుర్గారావు దొర, డాక్టర్ భారతలక్ష్మి

అమలాపురం టౌన్: జిల్లాలో క్షయ వ్యాధిని పూర్తిగా నియంత్రించే దిశగా శుక్రవారం నుంచి 21 రోజులపాటు ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర వెల్లడించారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో, జిల్లా క్షయ వ్యాధి నిర్మూలనాధికారి డాక్టర్ సీహెచ్‌వీ భారతలక్ష్మితో కలిసి ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. క్షయ వ్యాధి రోగులు వైద్యులు సిఫార్సు చేసిన మందులతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి త్వరగా నిర్మూలన అవుతుందని చెప్పారు. ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కింద క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా రూ.500 విలువైన పౌష్టికాహారం బాస్కెట్లు అందిస్తున్నట్టు చెప్పారు. కనీసం ఆరు నెలల పాటు ఈ పౌష్టికాహారం అందిస్తారన్నారు. జిల్లాలో క్షయ వ్యాధి నిర్ధారణ వైద్య పరీక్షలకు ట్రూనట్ మిషన్ కేంద్రాలు 11 ఉన్నాయన్నారు. జిల్లాలో ఏడు ట్రీట్మెంట్ సెంటర్లు ఉన్నాయని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం 777 మంది సాధారణ క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వీరిలో 33 మంది మొండి క్షయ రోగులు ఉన్నారని పేర్కొన్నారు. వీరికి ప్రత్యేక ప్రత్యేక వైద్యం కొనసాగుతోందని తెలిపారు. జిల్లా క్షయ నిర్మూలనాధికారి డాక్టర్ భారతలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో 52 మందివ్యాధిగ్రస్తులకు మూడు నెలల నుంచి 103 ఫుడ్ బాస్కెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. డాక్టర్ శిరీష, రామకృష్ణ పాల్గొన్నారు.

27న రత్నగిరి ధర్మకర్తల మండలి సమావేశం



ట్రస్ట్‌బోర్డు సమావేశం జరిగే కమాండ్ కంట్రోల్ రూమ్

అన్నవరం: అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి తొలి సమావేశం ఈ నెల 27న నిర్వహించనున్నారు. దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఐవీ రోహిత్ అధ్యక్షతన సమావేశం జరుగనుంది. చైర్మన్‌తో సహా 16 మంది సభ్యులకు సమావేశం సమాచారంతో పాటు ఆ రోజు చర్చించే అజెండా కాపీలు పంపించినట్లు అధికారులు తెలిపారు. సమావేశానికి ముందు రామాలయం పక్కన గల విశ్రాంతి మంటపంలో ట్రస్టీలకు అభినందన సభ నిర్వహించనున్నారు. తరువాత కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ట్రస్ట్‌బోర్డు సమావేశం జరుగుతుంది. గతంలో ధర్మకర్తల మండలి సమావేశం ప్రకాష్ సదన్ సత్రం దిగువన గల హాలులో జరిగేది. రామాలయం పక్కన కమాండ్ కంట్రోల్ రూమ్ అన్నింటికీ దగ్గరగా ఉంటుందనే అభిప్రాయంతో ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఇక్కడ సమావేశం నిర్వహించాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. మండలిలో సభ్యులుగా కొట్టెం పశువుల రావు, తాడి రజని, దోశ వీర సూర్యనారాయణ, నక్కా అశ్విని, సాపిశెట్టి భూలక్ష్మి, పేరూరి బద్రీనారాయణ, బొడ్డాని విజయలక్ష్మి, నున్న నరిసింహరావు, కడియాల లక్ష్మణరావు, కర్రి భామిరెడ్డి, రాయుడు సూర్యావతి, కేవీ నాగేశ్వరరావు, నేతల వేంకట లక్ష్మి, కారుకోడి పోచమ్మ, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ ఉన్నారు.

అంకితభావానికి పెద్ద పీట



ఎమ్మెల్సీగా గెలిచిన ఇజ్రాయిల్‌ని అభినందిస్తున్న ఎంపీ అనురాధ తదితరులు

- ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా గెలుపొందిన ఇజ్రాయిల్
- సామాజిక సమతూకం పాటించిన వైఎస్సార్ సీపీ

సాక్షిప్రతినిధి,కాకినాడ: చరిత్రలో తొలిసారి మాదిగ సామాజిక వర్గానికి వైఎస్సార్ సీపీ పెద్ద పీట వేసింది. గురువారం ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి చెందిన బొమ్మి ఇజ్రాయేల్ విజయం సాధించారు. ఈ ఎన్నికతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయ చరిత్రలో ఆ సామాజిక వర్గానికి పెద్దల సభలో తొలిసారి ప్రాధాన్యం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి ఎస్సీ బీసీలకు ప్రాధాన్యతను ఇస్తూ వస్తున్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చారు. బీసీలలో బలమైన శెట్టిబలిజ సామాజికవర్గం నుంచి ఉభయ తెలుగురాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడిపూడి సూర్యనారాయణ రావును ఎమ్మెల్సీగా చేశారు. ఈ రెండు సామాజికవర్గాలతో పాటుగా గవర్నర్ కోటాలో మత్స్యకార సామాజికవర్గం(వాడబలిజ) నుంచి కర్రి పద్మశ్రీని ప్రతిపాదించారు. ఇలా ఎస్సీ బీసీలకు పార్టీ విధానపరంగా ప్రాతినిధ్యం కల్పిస్తూ అగ్రాసనం వేయటంపై ఆయా వర్గాలలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో మొత్తంగా ఏడుగురికి పెద్దల సభలో ప్రాతినిధ్యం కల్పించినట్టయ్యింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ సీపీ నుంచి ఎస్సీ సామాజికవర్గం నుంచి పండుల రవీంద్రబాబు, కాపు సామాజికవర్గం నుంచి తోట త్రిమూర్తులు ఎమ్మెల్సీగా ఉన్నారు. ఇజ్రాయేల్ పార్టీ పట్ల అంకిత భావంతో ఉన్నారు. ఇందుకు ప్రతిఫలంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ అవకాశాన్ని కల్పించారు.

ఎంపీ అనురాధ శుభాకాంక్షలు

అల్లవరం: విజయం సాధించిన ఇజ్రాయిల్‌కు ఎంపీ చింతా అనురాధ, ఏపీ అగ్రిమిషన్ సభ్యులు జున్నూరి రామారావు, ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ తదితరులు అమరావతిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇజ్రాయిల్ గెలుపుతో గోడిలోని ఆయన నివాసం వద్ద పార్టీ శ్రేణులు, అభిమానులు బాణసంచా కాల్చి అభిమానాన్ని చాటుకున్నారు.

వనువులమ్మకు రూ.3 లక్షల వెండి కిరీటం

రాజోలు: పొదలాడ గ్రామంలో పునర్నిర్మాణం చేసిన శ్రీ వనువులమ్మ అంకాలమ్మ వారి విగ్రహానికి రూ.3 లక్షల విలువ చేసే వెండి కిరీటాన్ని స్థానిక యువరత్న ఎన్టీఆర్ సేవా సమితి సభ్యులు గురువారం బహూకరించారు. కేరళ డప్పు వాయిద్యాలు, గరగనృత్యాలతో ఉత్సవ విగ్రహాలు, పోతురాజు స్వామిని, అమ్మవారి వెండి కిరీటాన్ని ఊరేగించారు. మామిడిశెట్టి సోదరులు, గ్రామస్తులు, బ్రహ్మశ్రీ మానేపల్లి సత్యనారాయణ(చినబాబు) సిద్ధాంతి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



గ్రామంలో ఉత్సవమూర్తులు, వెండి కిరీటం ఊరేగిస్తున్న దృశ్యం

రత్నగిరిపై 'స్క్రాప్ వేలం ద్వారా ఆదాయం

అన్నవరం: సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని వివిధ విభాగాలలో వ్యర్థాలను (స్క్రాప్)' గురువారం వేలం వేశారు. తద్వారా రూ.4 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఈ నెల 4న వనదుర్గ ఆలయం సమీపంలో వ్యర్థాలను గమనించి వేలం వేయాలని ఆదేశించారు. ఇతర విభాగాలలో పేరుకుపోయిన వాటిని కూడా గుట్టగా పోసి గురువారం వేలం నిర్వహించారు.

గో సంరక్షణే సనాతన ధర్మం



అమలాపురం గోశాలలో మాట్లాడుతున్న శంకర్‌లాల్ రాజ్ పురోహిత్

అమలాపురం టౌన్: గోవుల సంరక్షణ జరిగే ఏ ప్రాంతమైనా సుభిక్షంగా ఉంటుంది. గో సంరక్షణ అనేది దేశ ఆచార సంప్రదాయాలను గౌరవించే సనాతన ధర్మమని భారతీయ జంతు సంక్షేమ సంస్థ సభ్యుడు శంకర్‌లాల్ రాజ్ పురోహిత్ అన్నారు. సనాతన ధర్మం – గో సంరక్షణ పేరుతో దేశ వ్యాప్త యాత్రలో భాగంగా రాజ్ పురోహిత్ అమలాపురంలోని గౌతమ మహర్షి గో సంరక్షణ గోశాలకు తన ప్రచార రథంతో గురువారం ఉదయం చేరుకున్నారు. ఈ సందర్భంగా గోశాలలోని గోవులతో ఆయన కొద్దిసేపు గడిపారు. మహారాష్ట్రలోని పూణె నగరంలో తాను 2016లో సనాతన ధర్మం– గో సంరక్షణ పేరుతో ప్రత్యేక వాహనంపై యాత్ర ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటి వరకూ మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పాండిచ్చేరి, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దాదాపు 60 వేల కిలోమీటర్ల ప్రయాణించి అయిదు వేల గ్రామాలను సందర్శించానని చెప్పారు. భారతదేశ గోవులకు మూపురంపై ఉండే సూర్య కేతు నాడి సూర్యుని కిరణాలకు ప్రతిస్పందిస్తుందని పేర్కొన్నారు. భారతీయ జంతు సంక్షేమ సంస్థ అనేది దేశంలో జంతు సంక్షేమ చట్టాలపై అవగాహన కల్పించే చట్టబద్ధమైన సలహా సంస్థ అని తెలిపారు. స్థానిక గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావుతోపాటు గోశాల సేవకులు, గౌతమ మహర్షి అక్షయ పాత్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

వెంకన్న నిత్యాన్నదానానికి విరాళాలు



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరాళాలు సమర్పించినట్లు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ముదినేపల్లి మండలం పెదగొన్నూరుకు చెందిన వి.వెంకట నాగ సత్యనారాయణ, వెంకట సునీత రూ.23,500, తాడేపల్లిగూడెంకు చెందిన ఎస్‌వీర వెంకట సత్యనారాయణ, పద్మావతి రూ.10,116, దెందులూరు మండలం గోపన్నపాలెంకు చెందిన కె. మణికంఠ రూ.10,116, చెన్నైకు చెందిన ఆర్.బాలాజీ, విజయశాంతి రూ.10,116, రావులపాలెంకు చెందిన వి. శ్రీనివాస్, ఉషారాణి రూ.10,116, లక్ష్మీపోలవరానికి చెందిన ఎ.బొజ్జివీరన్న రూ.10,116, తాడేపల్లిగూడెంకు చెందిన సీహెచ్ పద్మ రూ.10,116, సికింద్రాబాద్‌కు చెందిన కె.పార్థసారథి రూ.10,116 అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు.

ఆరోగ్య సమాజ స్థాపన దిశగా ముందడుగు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: రక్తహీనత పోషకాహార లేమిని చక్కదిద్దడంతో పాటుగా ఆరోగ్యకర సమాజ స్థాపన దిశగా ముందడుగు వేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అమరావతి నుంచి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాల విద్య, వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో సుస్థిరాభివృద్ధి లక్ష్యసాధన, గ్రామ వార్డు సచివాలయాల్లో గ్రీవెన్స్ పరిష్కార సరళిపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్య సంపూర్ణ పోషణ, బాలామృతం, తదితర పోషకాహార పథకాల ద్వారా బాలికలు, గర్భిణులు బాలింతలలో పోషణ లోపాలను, రక్తహీనతను చక్కదిద్దాలన్నారు. బడి బయట పిల్లలు ఎవరూ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీలో చేరిన చిన్నారుల్లో బరువు, ఎత్తు తక్కువ గల వారిని గుర్తించి లోపాలను సరిచేయాలన్నారు. పేదవర్గాల వారికి ఆహార భద్రతను కల్పించి, ఆరోగ్య, జీవన ప్రమాణాలు పెంపొందించాలన్నారు. మనబడి నాడు- నేడు రెండో దశ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గోరుముద్ద కార్యక్రమం కింద రాగి జావ పంపిణీ కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, కలెక్టరేట్ పరిపాలన అధికారి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

- మార్కెట్‌పై రైతుల సంతృప్తి
- కిలో గరిష్ట ధర రూ.210
- సగటు రేటు రూ.206
- ఐదు వేలం కేంద్రాల్లో మొదలైన విక్రయాలు

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో గురువారం పొగాకు కొనుగోళ్లు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.59 గంటలకు దేవరపల్లి వేలం కేంద్రంలో బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ కొనుగోళ్లు ప్రారంభించగా, గోపాలపురం వేలం కేంద్రంలో రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రారంభించారు. కిలో పొగాకు ప్రారంభ గరిష్ట ధర రూ.210 పలికింది. గత ఏడాది కిలో ప్రారంభ ధర రూ.195 కాగా, కొనుగోళ్లు ముగిసేనాటికి రూ.245 పలికింది. ఈ ఏడాది మార్కెట్లో ప్రారంభ ధరపై రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కంటే కిలోకు రూ.15 అదనంగా పెట్టి ప్రారంభ ధరను నిర్ణయించడంతో భవిష్యత్‌లో మార్కెట్ ఆశాజనకంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. దేవరపల్లి వేలం కేంద్రానికి చెరుకుమిల్లి క్లస్టర్ నుంచి 18 బేళ్లు, తూర్పుగోదావరి జిల్లా తొర్రేడు వేలం కేంద్రం(ప్రస్తుతం లేదు) పరిధిలోని గ్రామాల నుంచి తొమ్మిది బేళ్లు రైతులు వేలానికి తీసుకువచ్చారు. తొలిరోజు వేలం కేంద్రంలో 3,758 కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. కిలో సగటు ధర రూ.206 పలికింది. ఎనిమిది కంపెనీలు వేలంలో పాల్గొన్నాయి.


గోపాలపురం పొగాకు వేలం కేంద్రాన్ని ప్రారంభించి, పొగాకును పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

ప్రారంభ ధర కిలో రూ.225 ఆశించాం



కిలో పొగాకు ప్రారంభ ధర రూ.225 ఉంటుందని అనుకున్నాం. కొనుగోలుదారులు రూ.210 ఇచ్చారు. సగటు ధర రూ.220 ఇస్తే రైతులకు గిట్టుబాటు అవుతుంది. ఉత్పత్తి వ్యయం 30 శాతం పెరిగింది. దీనిని దృష్టిలో పెట్టుకుని మార్కెట్లో గిట్టుబాటు ధరకు పంటను కొనుగోలు చేయాలి.

– కరుటూరి శ్రీనివాస్, అధ్యక్షుడు, పొగాకు వేలం కేంద్రం, దేవరపల్లి

ఖర్చులు పెరిగాయి



తూర్పుగోదావరి జిల్లాలోని తొర్రేడు వేలం కేంద్రం పరిధిలోని ఉత్తర నల్లరేగడి భూముల్లో(ఎస్ఎల్ఎస్) పండిస్తున్న పొగాకును దేవరపల్లి వేలం కేంద్రంలో అమ్ముకోవలసి వస్తుంది. దీనివల్ల బేలుకు రూ.250 రవాణా ఖర్చులు అవుతున్నాయి. పెట్టుబడి తక్కువైనప్పటికీ రవాణా, ఎరువులు, బంటా, క్యూరింగ్ ఖర్చులు ఎక్కువ. 1,057 మంది రైతులు, 1,450 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. ఎకరాకు తొమ్మిది క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

– కాట్రగడ్డ సత్యనారాయణ, అధ్యక్షుడు, పొగాకు రైతు సంఘం, తొర్రేడు

నాణ్యత బాగుంది



ఈ ఏడాది పొగాకు నాణ్యత, దిగుబడులు బాగున్నాయి. మార్కెట్ కూడా ఆశాజనకంగా ఉంటుందని అనుకుంటున్నాను. తొలి రోజు ఐదు వేలం కేంద్రాల్లో కిలో ప్రారంభ ధర రూ.210 పలికింది. మార్కెట్లో అమ్ముడు పోయే బేళ్లను రైతులు వేలం కేంద్రాలకు తీసుకురావాలి. క్లస్టర్ వారీగా వేలం జరుగుతుంది. ఎనిమిది కంపెనీలు వేలంలో పాల్గొని కొనుగోలు చేశాయి.


– జీఎల్‌కే ప్రసాద్, పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు, రాజమహేంద్రవరం

వివాహితకు న్యాయం చేయాలంటూ ఆందోళన


ధర్నాలో పాల్గొన్న మహిళలు

ఉప్పలగుప్తం: పెళ్లి చేసుకుని కొన్ని రోజుల కాపురం చేసి వదిలేసిన వ్యవహారంలో భార్యకు న్యాయం చేయాలంటూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేశారు. మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి సూదాపాలెంలో భర్త ఇంటి వద్ద బాధితురాలు హేమలతతో కలసి గురువారం ఈ ఆందోళన నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన ఐ.హేమలత డిగ్రీ వరకు చదువుకుంది. 2018లో భీమనపల్లి పంచాయతీ శివారు సూదాపాలెంకు చెందిన ఇళ్ల రమేష్‌తో పెద్దల సమక్షంలో వివాహం కుదిరింది. కొన్ని కారణాల వల్ల పెళ్లి వాయిదా పడి 2020 డిసెంబర్ 24న హేమలత రమేష్‌లకు వివాహం జరిగింది. 48 రోజులు హేమలతతో కాపురం చేసిన రమేష్ అనంతరం తనకు పెళ్లి ఇష్టం లేదని, హేమలతను పుట్టింటికి పంపి తాను హైదరాబాదులో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో బాధితురాలు హేమలత ఐద్వాను ఆశ్రయించడంతో హేమలత భర్త రమేష్ ఇంటి వద్ద ఐద్వా మహిళలు ఆందోళనకు దిగి హేమలతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రమేష్ కుటుంబ సభ్యులను సంప్రదించగా తమకు ఈ విషయంలో ఎటువంటి సంబంధం లేదని, రమేష్ ఆచూకీ కూడా తెలియదని చెప్పారని ఐద్వా సంఘ మహిళలు తెలిపారు. ఈ విషయమై అమలాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. ఆందోళనలో ఐద్వా సంక్షేమ జిల్లా అధ్యక్షురాలు ఎం.డి.అమీదా, కార్యదర్శి టి.నాగలక్ష్మి, గ్రామ కమిటీ సభ్యులు రాయుడు గౌరీ, గుత్తుల తేజకుమారి, డి.దుర్గాభవాని, వి.దుర్గ, ఆర్.దేవి, వి.జ్యోతి పాల్గొన్నారు.

అరుణ కాంతులీనిన రామలింగేశ్వరుడు


అరుణ కిరణ కాంతిలో రామలింగేశ్వరుడు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలోని ఉమా రామలింగేశ్వరుడిని గురువారం సూర్య కిరణాలు తాకాయి. అరుణ కిరణ కాంతిలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. భానుడి స్పర్శతో గర్భాలయం వెలుగులీనింది. ఏటా మార్చి, సెప్టెంబర్‌లలో రెండు సార్లు సూర్య కిరణాలు స్వామిని తాకుతాయని ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు.


ఆలయంలో పందిరి రాట వేస్తున్న దృశ్యం

వెంకన్న కల్యాణానికి పందిరి రాట

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి పందిరి రాటను ఆలయ అర్చకులు నిలిపారు. తొలుత సన్నాయి మేళాలతో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నెల 31 నుంచి వారం రోజులపాటు స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఈ నెల 31న స్వామివారి ధ్వజారోహణ, నిత్యబలిహరణ, దర్శనాలు, ఏప్రిల్ ఒకటిన స్వామి వారి తీర్థం, రథోత్సవం, కల్యాణం, 2న స్వామి వారి మేలుకొలుపు, సేవ, ప్రధాన హోమాలు, 3న పొన్నవాహన మహోత్సవం, 4న సదస్యం, మహదాశీర్వచనం, 5న గోదావరి నదిలో తెప్పోత్సవం, 6న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, 7న పుష్పయాగం నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు వివరించారు.

నేటి నుంచి పవిత్ర రంజాన్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైంది. ఈ నెలలోనే దివ్య ఖురాన్ అవతరించింది. రంజాన్ అంటే ఒక నెల పేరు. ఇస్లామిక్ క్యాలెండరు ప్రకారం తొమ్మిదో నెల. ఈ నెలలో ముస్లింలు ఉపవాసాలు పాటిస్తూ తమను తాము సంస్కరించుకుంటూరు. అల్లాహ్‌పై విధేయతను ప్రకటిస్తూ, అల్లా విధించిన కట్టుబాట్లను ఆచరిస్తూ క్రమశిక్షణ జీవితాన్ని గడుపుతారు. ఉపవాసం మనలోని మాలిన్యాన్ని కడిగేయడానికి ప్రయత్నిస్తుంది. చెడును దూరం చేసి సత్ప్రవర్తన వైపు నడిపిస్తుంది

ఉపవాస నియమాలు

వేకువజామున 4:30 గంటల లోపు (సహరి) భోజనాది కార్యక్రమాలు పూర్తి చేయాలి. మళ్లీ సాయంత్రం 6.30 వరకు (ఇఫ్తార్) వరకు ఎటువంటి ఆహారం, నీరు తీసుకోకూడదు. రోజా సుమారు 14 గంటల వరకు ఈ ఉపవాస దీక్ష ఉంటుంది. సహరితో మొదలై ఇఫ్తార్‌తో రోజా ముగుస్తుంది. ఉపవాసం ఉన్న వ్యక్తి చెడు తలంపులకు దూరంగా ఉండాలి. అబద్ధాలు చెప్పకూడదు. ఘర్షణలకు దిగకూడదు. ఎవరైనా ఘర్షణకు దిగినా, నేను ఉపవాసంలో ఉన్నానంటూ చెప్పాలి.

ఇఫ్తార్ సమయం

సహనం జీవితంలో భాగమయ్యేటట్లు ఇఫ్తార్ చేస్తుంది. 14 గంటల పాటు కఠిన ఉపవాస దీక్షలో ఉన్న వ్యక్తి ఇఫ్తార్ (ఉపవాస విరమణ) సమయంలో కాస్త నీరసంగా కనిపిస్తారు. కళ్ల ముందే అన్ని రకాల ఆహార పదార్థాలు ఉంటాయి. కానీ నిర్ణీత ఉపవాస విరమణ ఘడియ వచ్చే వరకు ఏ ఒక్క ఆహార ప దార్థాన్ని తాకరు. సహనం వీడరు. ఎవరైతే కష్టసమయంలో సహనం, ఓర్పు వహిస్తారో వారిపై తన కరుణ ఎల్లప్పుడూ ఉంటుందని అల్లాహ్ ఖురాన్‌లో తెలిపారు. రాజమహేంద్రవరంలో గురువారం రాత్రి నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు ముస్లిం ప్రతినిధులు తెలిపారు.

భార్యపై హత్యాయత్నానికి 10 ఏళ్ల జైలు

పిఠాపురం: భార్యపై అనుమానం పెంచుకుని ఆమెను అంతం చేయాలని ప్రయత్నించి హత్యాయత్నం చేసిన భర్తకు న్యాయమూర్తి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కథనం ప్రకారం ముమ్మిడి సుబ్రహ్మణ్యం, భార్య సుబ్బలక్ష్మి పిఠాపురం ఐశ్వర్య గార్డెన్స్‌లో నివాసముండేవారు. భర్త సుబ్రహ్మణ్యం సౌత్ ఈస్టన్ సెంట్రల్ రైల్వేలో బిలాస్‌పూర్ మేనేజర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. పిఠాపురంలో ఉంటూ సుదూర ప్రాంతానికి ఉద్యోగం కోసం వెళ్లి వస్తుండే అతను.. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. ఆమె పేరున ఉన్న 10 ఎకరాల భూమిని తన పేరుపై రాయాలంటూ ఒత్తిడి తెచ్చేవాడు. అయితే 'నా ఆస్తి మన ఇద్దరికీ చెందుతుంది. మీ పేరున రాయడం ఎందుకు అంటూ' భార్య వ్యతిరేకించడంతో ద్వేషం పెంచుకున్నాడు. ఎలాగైనా ఆమెను అంతం చేయాలని పన్నాగం పన్నాడు. 25 మే 2018వ తేదీన ఇంటి వద్దే ఉన్న భర్త తన భార్యను తీసుకుని కొత్తపల్లి మండలం కొండెవరం బంధువుల ఇంటికి వెళ్లి వచ్చాడు. ఆరోజు రాత్రి 9–30 గంటల ప్రాంతంలో భార్య నిద్రపోగానే ఆమెపై మత్తు మందు చల్లాడు. ఆమె మత్తులోకి వెళ్లి పోగానే కత్తితో విచక్షణారహితంగా నరికి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ఆమెకు రెండు చేతులు మణికట్టు వద్ద తెగిపోగా పలు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ఆ మరునాడు ఉదయం 6 గంటల సమయంలో మత్తు వదలి మెలుకువ వచ్చిన ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై 26 మే 2018లో అప్పటి పిఠాపురం పట్టణ ఎస్సై శోభన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చారు. ముద్దాయిపై నేరం రుజువు కావడంతో పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.మాధవి గురువారం తీర్పు చెప్పారు. ఏపీపీ దామెర కిరణ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

స్వీడెన్ బ్లేకింగ్ యూనివర్సిటీతో జేఎన్‌టీయూకే ఒప్పందం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే స్వీడన్‌లో బ్లేకింగే యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీతో కొనసాగిస్తున్న కోర్సుల నిర్వహణపై గురువారం రెండు యూనివర్సిటీల అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ జేఎన్‌టీయూకే స్వీడన్‌లోని బ్లేకింగే యూనివర్సిటీ ద్వారా కుదుర్చుకున్న కోర్సుల ఒప్పందం యథావిధిగా కొనసాగించడంతోపాటు ఆదరణ ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ కోర్సు ఈ ఏడాది అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. అడ్మిషన్‌కు నోటిఫికేషన్ జారీ చేసి ఆగస్టులో అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఎంవోయూపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. బ్లేకింగ్ వీసీ ప్రొఫెసర్ మార్క్స్ వైబెర్గ్, డిప్యూటీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గురుదత్త వేల్పుల, కో–ఆర్డినేటర్ ఫణిశేఖర్, జేఎన్‌టీయూకే రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డీపీఏ సీహెచ్ సాయిబాబు, డీపీపీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

అలరిస్తున్న నాటికలు

రావులపాలెం: ఉగాది పండగను పురస్కరించుకుని రావులపాలెంలోని కాస్మోపాలిటన్ రిక్రియేషన్‌క్లబ్ (సీఆర్‌సీ) కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో సీఆర్‌సీ కళావేదికలో నిర్వహిస్తున్న 23వ ఉగాది జాతీయ తెలుగు నాటికల పోటీలు విశేషంగా అలరిస్తున్నాయి. రెండో రోజు పోటీలను తిలకించేందుకు పరిషత్ గౌరవ అధ్యక్షుడు, సినీ నటుడు తనికెళ్ళ భరణి, సినీనటులు కోట శంకరరావు, గౌతంరాజు, సైనా, కృష్ణ చైతన్య, తదితరులు హాజరయ్యారు. గురువారం మూడు నాటికలు ప్రదర్శించారు. వరంగల్ ఓరుగల్లు శారదా నాట్యమండలి వారి ఫ్రీడమ్ ఫైటర్, హైదరాబాద్ కళాంజలి వారి రైతేరాజు, కాకినాడ శ్రీ సాయి కార్తిక్ క్రియేషన్ వారి ఎడారిలో వాన చినుకు నాటికలు ఆహుతులను విశేషంగా అలరించాయి. ఏర్పాట్లను సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, నాటక కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, పరిషత్ పర్యవేక్షణ డైరెక్టర్ వెలగల సతీష్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఫ్రీడమ్ ఫైటర్

తన జీవితాన్ని మాతృభూమి కోసం తృణ ప్రాయంగా వదిలేసి, వ్యక్తిగతంగా ఎన్నో సంఘర్షణలను అనుభవించి ఒక స్వాతంత్ర్య సమరయోధురాలు ఈ సమాజానికి సంధించిన ప్రశ్న మా ఈ ఫ్రీడమ్ ఫైటర్ అంటూ సాగిన నాటిక ఆకట్టుకుంది.

రైతేరాజు

ఇవాళ టెక్నాలజీ పెరిగింది. పిడికెడంత సెల్‌ఫోన్‌తో ప్రపంచాన్నే శాసిస్తున్నారు. కానీ రైతు పండించే పిడికెడం


ఫ్రీడమ్ ఫైటర్ నాటికలో ఆకట్టుకున్న ఒక సన్నివేశం

తా అన్నం తినకుండా ఏ మనిషీ బతకలేడు. అలాంటి రైతన్నను పట్టించుకునే నాథుడే లేడు. గుండుసూది నుంచి విమానం దాకా ఏ వస్తువైనా తయారు చేసిన వాడు తన వస్తువు రేటు నిర్ణయించుకుంటాడు. రైతుకు మాత్రం రేటు నిర్ణయించుకునే హక్కు లేదు. రైతు కన్నెర్ర చేస్తే, పంటకు సెలవు ప్రకటిస్తే, ఆలోచించమని చెప్పే నాటికే రైతే రాజు.

ఎడారిలో వాన చినుకు

సురేష్ తన తల్లిదండ్రులైన శారదమ్మ, సుందరయ్యలను వృద్ధాశ్రమంలో వదిలేస్తాడు. అమెరికా నుంచి వచ్చిన మనోజ్ వారిని తల్లిదండ్రులుగా దత్తత తీసుకుందామని అనుకుంటే, సురేష్ వారిని పాతిక లక్షల రూపాయలకు బేరం పెడతాడు. ఆగ్రహించిన తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయమే ఎడారిలో వాన చినుకు నాటిక సారాంశం. ఈ నాటిక ప్రేక్షకులకు కంటనీరు పెట్టించింది.